అడుగంటుతున్న ఆశలు

- కుభీర్ మండలంలో ఎండిపోతున్న బోరుబావులు
- గతేడాది యాసంగి కంటే తగ్గిన మొక్కజొన్న సాగు
- తక్కువ నీటి అవసరం ఉంటుందని శనగ పంట వేస్తున్న రైతులు



కుభీర్‌లో మొక్కజొన్న పంట తొలగించి శనగ వేసిన చేను

కుభీర్: మండలంలోని ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోరుబావులు ఎండుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గతేడాది యాసంగిలో కంటే ఈసారి కుభీర్ మండలంలో మొక్కజొన్న పంట సాగు తగ్గింది. నీటి తడులు తక్కువ అవసరమయ్యే శనగ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. విత్తనాలు విత్తిన తర్వాత బోరుబావులు ఎండుతుండటంతో పలు చోట్ల మొక్కజొన్న పంటను తొలగించి మళ్లీ శనగ పంట సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చే నాటికి శనగ పంటకు కేవలం రెండు నీటి తడులు అందిస్తే చాలు.. కానీ మొక్కజొన్న పంటకు ఏడు తడులను అందించాల్సి ఉంటుంది. ఈ కారణంగానే మండలంలోని అన్నదాతలు శనగ పంటను ఎక్కువ సాగు చేస్తున్నారు.

140 ఎకరాలు తగ్గిన సాగు..

కుభీర్ మండలంలో 15వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది యాసంగిలో మండలంలో వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేయగా.. ఈసారి 860 ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా తెలిపారు. మరోవైపు గతేడాది యాసంగిలో 800 ఎకరాల్లో శనగ పంట వేయగా.. ఈసారి మాత్రం 920 ఎకరాల్లో సాగు చేసినట్లు పేర్కొన్నారు.



దార్‌కుభీర్‌లో ఎండిపోయిన బోరుబావి



దార్‌కుభీర్‌లో వేసిన శనగ పంట

అడుగంటిన భూగర్భజలాలు..

గతేడాది మార్చిలో దార్‌కుభీర్, రాజురా, కుభీర్, పార్డి(కె), జామ్‌గాం తదితర గ్రామాల్లో బోరుబావులు ఎండిపోవడంతో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట ఎండిపోయి రైతులు నష్టపోయారు. ఈసారి కూడా గతేడాది లాంటి పరిస్థితే పునరావృతం అవుతుందని శనగ పంటను వేస్తున్నారు. ఇప్పటికే కుభీర్, దార్‌కుభీర్ గ్రామాల్లో వ్యవసాయ బోరుబావులు అడుగంటిపోయాయి.

మొక్కజొన్న పంటను తొలగిస్తున్న రైతులు..

మండలంలోని పలు గ్రామాల్లో కొందరు తమ బోరుబావిలో నీరు ఉంటుందని మొక్కజొన్న, మరికొందరు శనగ పంట సాగు చేశారు. విత్తనాలు మొలకెత్తడంతో ఆయా చేన్ల వద్ద బోరుబావులు ఎండిపోతున్నాయి. నీరు కొద్దికొద్దిగా పోస్తున్న బోరుబావులున్న చోట మొక్కజొన్న పంటను తొలగించి మళ్లీ శనగ వేస్తున్నారు. విత్తనాలు, చేను దున్నినందుకు అదనంగా పెట్టుబడి అవుతోంది. నీరు లేక శనగ పంట కూడా ఎండిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

బోరుబావి ఎండిపోయింది



మూడెకరాల్లో శనగ పంట సాగు చేశా. విత్తనాలు మొలకెత్తగానే బోరుబావి ఎండిపోయింది. ప్రస్తుతం పక్క చేను రైతు బోరు నుంచి పెట్టుకుంటున్నా. ఆ బోరు సైతం గ్యాప్ ఇస్తూ కొద్దికొద్దిగానే నీరు పోస్తుంది. ఇప్పుడేం చేయాలో తెలియడం లేదు.

– రాంచందర్, రైతు, దార్‌కుభీర్

మొక్కజొన్న తొలగించి శనగ వేశా..



రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. విత్తనాలు మొలకెత్తగానే బోరుబావి ఎండిపోయింది. దీంతో పంట ఎండిపోయింది. మళ్లీ పక్క చేను రైతు బోరు నుంచి నీళ్లు ఇవ్వడంతో శనగ పంట సాగు చేశా. దీంతో విత్తనాలు, మళ్లీ చేను దున్నేందుకు అదనంగా రూ.15వేలు ఖర్చయ్యాయి.

– దొంతుల గంగాధర్, రైతు, కుభీర్

శనగ విస్తీర్ణం పెరుగుతోంది

గతేడాది యాసంగి కంటే ఈ సారి మండలంలో సుమారు 120 ఎకరాల్లో శనగ సాగు పెరిగింది. బోరుబావులు ఎండిపోతుండటంతో మొక్కజొన్న పంటను తొలగించి శనగ వేసేవారి సంఖ్య పెరుగుతోంది. మొక్కజొన్న గతేడాది కంటే 140 ఎకరాలు తగ్గింది. బోర్లు ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు.

– వికారొద్దీన్, వ్యవసాయాధికారి, కుభీర్

అభివృద్ధి చూసి ఎమ్మెల్యేగా గెలిపించండి

- ప్రజలను మోసం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ యత్నం
- మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఐకేరెడ్డి



మామడ మండలం గాయిద్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మామడ: చేసిన అభివృద్ధి చూసి మళ్లీ నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాయదారి, ఆరేపల్లి, గోండుగూడ, రచ్చకోట, గాయిద్‌పల్లి, బురదపల్లి, తండ్రా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేసేందుకు మరోసారి ఆచరణకు సాధ్యం కాని మేనిఫెస్టోను విడుదల చేశాయని విమర్శించారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రాంకిషన్‌రెడ్డి, భూషన్‌రెడ్డి, భాస్కర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, రాందాస్, భాస్కర్, అరవింద్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంద్రకరణ్ రెడ్డిని గెలిపించండి'

నిర్మల్‌టౌన్: నిర్మల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కాలనీవాసులు ఉన్నారు.



నిర్మల్‌టౌన్: భాగ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

సోన్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి పథకాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఇంద్రకరణ్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మోహినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ వినోద్ కుమార్, శ్రీనివాస్, అంబేకర్ ప్రసాద్, కాంతయ్య, గంగాధర్ తదితరులున్నారు.



సోన్‌లో ప్రచారం చేస్తున్న సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డిని గెలిపించండి
- లక్ష్మణచాంద ఎంపీపీ పద్మ

లక్ష్మణచాంద: ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని.. ఈసారి ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మల్ ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కేంద్రం ఇస్తున్న నిధులను తామే ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అడ్వాల రమేశ్, మండల కేంద్రం సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: జిల్లా కేంద్రంలో జరిగిన సకల జనుల సంకల్ప సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో బీజేపీ కార్యకర్తలు, మహిళలు క్రషర్ గ్రౌండ్‌కు వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జక్క రాజేశ్వర్, మక్కన్న, ముత్కపల్లి నరేశ్, నర్సయ్య, రవి, సంతోష్, పోశెట్టి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ పద్మ



సోన్ నుంచి నిర్మల్ వెళ్తున్న బీజేపీ నాయకులు

ప్రధానితో లక్ష్మణచాంద సర్పంచ్

లక్ష్మణచాంద: ఎస్పీజీ భద్రత, ఎన్ఎస్‌జీ కమాండోలను దాటుకొని ప్రధాని మోదీని కలవడం అంత సులభం కాదు. కానీ మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ ముత్యంరెడ్డి సువర్ణ అవకాశం దక్కించుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ వచ్చిన ప్రధాని మోదీ వేదికపై వెళ్తుండగా లక్ష్మణచాంద సర్పంచ్ ప్రధానిని కలిశారు.



ప్రధానికి నమస్కరిస్తున్న ముత్యంరెడ్డి

క్లుప్తంగా

అయ్యప్ప మహాపడి పూజ



అభిషేకం చేస్తున్న గురుస్వామి

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో గురుస్వామి నోముల నవీన్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. కొండల్‌వాడి గురుస్వామి రమణప్రసాద్, రవీందర్ రెడ్డి, లింగారెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప, గణపతి, కుమారస్వామిలకు, పాలు తేనె, పెరుగు, నెయ్యితో అభిషేకాలు చేశారు. పూజలో భైంసా, తానూరు, కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్(జి), ముధోల్, నందిపేట్ మండలాలకు చెందిన 600 మంది స్వాములు పాల్గొన్నారు. నేరడిగొండ శ్రీకాంత్, కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

పర్సు అప్పగింత

కుంటాల: కుంటాలకు చెందిన ప్రైవేట్ టీచర్ దొనికెన గజ్జారాం వ్యవసాయ పనుల నిమిత్తం ఓలా వెళ్తుండగా మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి తన పర్సు పోగొట్టుకున్నాడు. కాగా ఆ మార్గంలో వెళ్తున్న కుంటాలకు చెందిన అమ్మ హోటల్ యజమాని నవీన్‌కు సదరు పర్సు దొరికింది. అందులో ఉన్న వివరాల ఆధారంగా గజ్జారాం అడ్రస్ తెలుసుకొని ఆదివారం పర్సును బాధితుడికి అందించారు. పర్సులో రూ.నాలుగు వేల నగదు, గుర్తింపు కార్డులు ఉన్నట్లు బాధితుడు పేర్కొని.. నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోపణలు మానుకోవాలి'

భైంసాటౌన్: ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఆయన సోదరుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యకాంత్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు మానుకోకుంటే మీ అక్రమాల చరిత్ర బయట పెడతామంటూ బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు సోలంకి భీంరావు, పండిత్‌రావులను ఉద్దేశించి మాట్లాడారు. రాజకీయంగా పదవుల భిక్ష పెట్టిన గడ్డిగారి కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ వీడి వేరే పార్టీలో చేరినా ఎన్నడూ విమర్శించని ఎమ్మెల్యే, ఆయన సోదరుడిపై ఇష్టారీతిన నోరు జారితే సమాధానం చెబుతామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు కానరాని అవినీతి.. పార్టీ మారినా తర్వాత గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. ఆరోపణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.బీఆర్‌ఎస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, రాందాస్, సచిన్, నంగి రాజేశ్, సట్ల భూమేశ్, రమణారెడ్డి, సాహెబ్‌రావు, రాంకుమార్, అమేందర్‌రెడ్డి, గాజుల గంగాధర్ తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

తానూరు: చెడు వ్యసనాలు వీడి.. ప్రశాంత జీవనానికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని మహారాష్ట్రలోని అంలది జిల్లాకు చెందిన శివాజీ మహారాజ్ అన్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం ఆదివారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యా కీర్తనలో వారు పాల్గొని భక్తులకు పలు సూచనలు చేశారు. పలువురు తులసీమాలలు ధరించగా ఉట్టి కొట్టి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం మహారాజ్‌లను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పండరి, ఉపాధ్యక్షుడు రాములు, కార్యదర్శి గోవింద్ పటేల్, సభ్యులు యోగేశ్, శివ, దేవిదాస్, మారుతి, అర్చకులు పింటు మహారాజ్, వార్‌కరి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తానూరులో మహారాజ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ముగిసిన జ్ఞానేశ్వరి పారాయణం

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న జ్ఞానేశ్వరి పారాయణం ముగిసింది. ఆదివారం గ్రామంలోని వీధుల్లో పల్లకి ఊరేగింపు శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగాంబర్ మహారాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భగవంతుని నామస్మరణ చేయాలని సూచించారు. వార్‌కరి భక్తులు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ చూపిన బాటలో నడవాలి

భైంసారూరల్: అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షుడు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. ఆదివారం మండలంలోని పెండ్‌పల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం, బీఎస్‌ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోహన్, పవన్, శ్రీనివాస్, అనిల్, రాజు, గోపి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే నేడు భారతావనిని కాపాడుతోందని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షుడు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. ఆదివారం మండలంలోని హథ్‌గాం గ్రామంలో బీఎస్‌ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం గ్రామాధ్యక్షుడు సాయినాథ్, బీఎస్‌ఐ మండల అధ్యక్షుడు దిలీప్ తదితరులున్నారు.



భైంసారూరల్: పెండ్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

భైంసాటౌన్: పట్టణంలో ఆయా కాలనీలతోపాటు బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రాహుల్‌నగర్ బుద్ధవిహార్‌లో సైతం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దీపోత్సవం, తులసీమాత కల్యాణం



లోకేశ్వరం శివాలయంలో మహిళలు



కుంటాలలో..

లోకేశ్వరం: కార్తీకమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం రాత్రి కార్తీక దీపోత్సవం కనులపండువగా నిర్వహించారు. లోకేశ్వరం వీడీసీ ఆధ్వర్యంలో వేదపండితులు అమూల్ పంతులు తులసీపూజ, రుద్రాభిషేకం చేశారు. మహిళలు తరలివచ్చి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ అంబకంటి శ్రీనివాస్, కుమ్మరి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో ఆదివారం వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ భక్తులకు గోమయ ప్రతిమలను ఉచితంగా అందజేశారు. మహిళలు తరలివచ్చి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు మహిళలు ఆదివారం తులసీమాత కల్యాణం జరిపించారు. అలంకరించిన తులసి కోట వద్ద శ్రీరాధాకృష్ణ చిత్రపటాలను ఉంచి, ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని వత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని తులసిమాత కల్యాణం నిర్వహించారు. తమ ఇళ్లలోని తులసి గద్దెను అలకరించి రాధాకృష్ణుల చిత్రపటం ఉంచి కల్యాణం జరిపించారు.

ఉద్యమ నాయకుడు శ్రీహరిరావును గెలిపించండి

లక్ష్మణచాంద: ప్రత్యేక రాష్ట్ర సాధనకు పోరాడిన ఉద్యమకారుడు, కాంగ్రెస్ నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావును గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఆదివారం లక్ష్మణచాందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఓటర్లకు వివరించారు. అట్ల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాగాంధీ కృతజ్ఞతలు తెలుపుతామని పేర్కొన్నారు. అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, రవి, నాగేష్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు.

ప్రధాని సభ సైడ్‌లైట్స్..

- ఆదివారం మధ్యాహ్నం 3:45 గంటలకు హెలీకాప్టర్‌లో ప్రధాని నరేంద్రమోదీ కలెక్టరేట్ మార్గంలోని క్రషర్‌ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- 3.54కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో సభా ప్రాంగణానికి చేరుకున్నారు
- 3.56 గంటలకు సభా వేదికపైకి వచ్చారు.
- 3.58 గంటలకు ప్రసంగం ప్రారంభించి 4.38 గంటల వరకు మాట్లాడారు. 40 నిమిషాల పాటు ప్రసంగం సాగింది.
- మోదీ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది.
- మోదీ ప్రసంగాన్ని ప్రారంభించే ప్రతిసారి నా కుటుంబ సభ్యులారా అని సంబోధించారు. అక్కడున్న వారంతా చప్పట్లు కొట్టి ఆనందాన్ని తెలియజేశారు.
- తెలంగాణ మే పహ్లీ బార్.. బనేంగే బీజేపీ సర్కార్ అని ప్రజలతో పలుమార్లు చెప్పించారు.
- ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో ఫ్లాష్ లైట్ ఆన్‌చేసి బీజేపీకి మద్దతు తెలుపమని ప్రధాని కోరగా, సభకు హాజరైన స్పందించి మద్దతు తెలిపారు.
- సభా వేదిక ముందు భరతమాత, శ్రీరాముడి వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.
- 4:41 గంటలకు సభా వేదికపై నాయకుల సన్మానాలు స్వీకరించి తిరిగి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- సభ ప్రారంభానికి ముందు కళాకారుల ఆటపాటలు ఉత్సాహం నింపాయి.
- బీజేపీ సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షించారు.

– నిర్మల్ చైన్‌గేట్

విఠల్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

కుభీర్: ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అనిల్, రహూఫ్, నాగలింగం, వివేక్, రాజు, రాజన్న, సంతోష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): విఠల్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని చాక్ పల్లి పంచాయతీ పరిధిలోని బూర్గుపల్లి(కె)లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకురాలు రమాదేవి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు కల్యాణ్ ప్రవీణ్‌పటేల్, మక్బుల్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



బూర్గుపల్లి(కె)లో మాట్లాడుతున్న రమాదేవి

ముధోల్: కారు గుర్తుకే ఓటేయాలని బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, ఎజాజ్, అనిల్, మఖ్దూం, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'నారాయణ్‌రావు పటేల్‌ను గెలిపించాలి'

కుభీర్: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జీబుఅడ్డాలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ వాహెద్, జావెద్‌ఖాన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని పేర్కొన్నారు. ముధోల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ్‌రావు పటేల్‌ను గెలిపించాలని కోరారు. వారి వెంట నాయకులు ఉన్నారు.



కుభీర్‌లో మాట్లాడుతున్న నాయకులు

'ఓట్ల కోసమే జిమ్మిక్కులు'

కడెం: ఓట్ల కోసమే సీఎం కేసీఆర్ జిమ్మిక్కులు చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరదలు ఎదుర్కొన్న కడెం ప్రాజెక్ట్ గురించి సీఎం మాట్లాడకపోవడం రైతులపై వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందన్నారు.